
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025

5

తిరుపతి



చల్లా వెంకటయ్య, కుప్పస్వామిలకు సన్మానం



ప్రజాశక్తి - రేణిగుంట: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐ(ఎం) అఖిలభారత మహాసభలు మధురైలో 2025 ఏప్రిల్ 2 నుండి 6 వరకు జరిగిన సభలకు తిరుపతి నుండి మార్చి 29 న సైకిల్ యాత్ర ప్రారంభించి మధురై వరకు 550 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ ఏప్రిల్ 5న మధ్యాహ్నం1గంటకు చేరుకున్న కామ్రేడ్ చల్లా వెంకటయ్య (72), కామ్రేడ్ కొర్లమల్లి కుప్ప స్వామి (59)లను ఆదివారం రేణిగుంట సిపిఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. 'పెరియార్' రామస్వామి, 'మలాల' పుస్తకాలను జ్ఞాపకంగా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు వెంకటరమణ, ఈశ్వరమ్మ, దిలీప్ భాషా, శివానందం, సత్య శ్రీ, సెల్వరాజు, నారాయణ, సుబ్రహ్మణ్యం, భారతి, పద్మ, సులోచన, అమ్ములు, జయరామ్, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితం అంటూనే రూ.100 వసూలు

- కొత్త బియ్యం కార్డుల దరఖాస్తుకు కష్టాలు
- మ్యారేజ్ సర్టిఫికెట్ తంటాలు
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ లేక ఇబ్బందులు
- సచివాలయాల్లో లబ్దిదారుల పాట్లు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెటు తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఆశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

దరఖాస్తు చేయాలంటే రూ.100..

రేషన్ కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ. 100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తిరుపతి అర్బన్ తోపాటు రూరల్‌లో ఒక సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

దరఖాస్తుకు నిబంధనలు..

కూటమి ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. జిల్లాలోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తులను ఆన్లైన్ చేసే ప్రక్రియకు విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్ కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్లైన్లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదం ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారింది. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కొందరు కోల్పోతారు.

నిబంధనలు సడలించాలి..

హౌసోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి, వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్ తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదా..!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

బయోమెట్రిక్స్..

కార్డుల దరఖాస్తులను ఆన్లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్ లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు..

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది. మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్య, పిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.


ఆధార్ చిరునామాతోనే..

ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్లైన్లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది. చిన్నారుల బాల ఆధార్ అప్డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

రీశాట్ - 1బి శాటిలైట్

విఫలంపై విశ్లేషణ

- గతి తప్పిన పిఎస్ఎల్ వి సి 61 రాకెట్
- విశ్లేషణ తర్వాత వివరాలు వెల్లడిస్తామన్న శాస్త్రవేత్తలు..



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఇస్రో 2025లో తన వందో ప్రయోగాన్ని విజయవంతం చేసి సక్సెస్ జర్నీ కొనసాగించింది. ఇదే ఉత్సాహంతో దేశ భద్రతకు కీలకమైన శాటిలైట్ ప్రయోగంతో 101వ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. ఆదివారం తిరుపతి జిల్లాలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 5:59కి నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటించారు. పీఎస్ఎల్వీ రాకెట్ సాయంతో ఈఓఎస్ 09 శాటిలైట్‌ను భూమికి 529 కిలోమీటర్ల ఎత్తులో సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఇందుకోసం ఈ రాకెట్ 17 నిమి షాల 39 సెకన్ల పాటు 4 దశల్లో ప్రయాణించాల్సి ఉంది. మొదటి రెండు దశల వరకు దీని ప్రయాణం సాఫీగానే సాగింది. కానీ మూడో దశలోనే సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ నిర్దేశిత మార్గంలో కాకుండా మరో మార్గంలో ప్రయాణించడం మొదలు పెట్టింది. ఇందులో లోపం ఎక్కడ తలెత్తిందన్న వివరాలను విశ్లేషణ తర్వాత వెల్లడిస్తామని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలిపారు.


మూడో దశలో సాంకేతిక సమస్య : ఇస్రో ఛైర్మన్ నారాయణన్

ఆదివారం శ్రీహరి కోట నుంచి 101వ ప్రయోగాన్ని చేపట్టాం. పీఎస్ఎల్ సి-61 రాకెట్ సాయంతో ఈఓఎస్ 09 శాటిలైట్ మిషన్‌ను ప్రయోగించాం. 1,2 దశల వరకూ అంతా సాఫీగానే సాగింది. మూడో దశలో మాత్రం మేం కొన్ని ఇబ్బందులను గమనించాం. దీంతో మిషన్ పూర్తి కాలేదు. పూర్తి విశ్లేషణ తర్వాత మళ్లీ మీ ముందుకొస్తాం. థాంక్యూ" అని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు.

ఆదివారం ప్రయోగించిన పీఎస్ఎల్వీ -సీ61 విఫలం

కీలమైన సమాచారం అందించే శాటిలైట్, భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఇస్రో తన 101వ ప్రయోగం చేపట్టింది. నిజానికి ఇస్రో ప్రయోగానికి, ఇప్పుడున్న ఉద్రిక్త పరిస్థితులకు ఒక సంబంధం ఉంది. ఇస్రో గతంలో ప్రయోగించిన శాటిలైట్లు కొన్ని రక్షణ రంగానికి కీలకమైన సమాచారం అందించాయి. ఆ కోవలోనిదే ఇప్పుడు ప్రయోగించిన ఈఓఎస్ 09 కూడా. దీనిని ఒక గూఢచార శాటిలైట్‌గా పలు మీడియా సంస్థలు చెప్పుకొచ్చాయి. ఇది భారతదేశానికి నిఘా నేత్రం లాంటిదని చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకూ భారత రక్షణ రంగానికి వెన్నుదన్నుగా ఉండేందుకు ఈఓఎస్ 04 వంటి శాటిలైట్లను ప్రయోగించిన ఇస్రో.. ఇప్పుడు ఈ సీరిస్‌లోనే ఈఓఎస్ 09ను ప్రయోగించింది. ఇది రిమోట్ సెన్సింగ్ డేటాను అందిస్తుంది. "గతంలో భారత సైన్యం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్ వంటి సమయాల్లో కార్టోశాట్ వంటి ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్లు ఇచ్చిన డేటానే ఆధారం చేసుకున్నాయని" ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ బీబీసీకి తెలిపారు. అయితే కార్టోశాట్ వంటి ఉపగ్రహాలు పంపే డేటాకు కొన్ని పరిమితులున్నాయి. అంటే ఈ శాటిలైట్లు రాత్రి పూట చిత్రాలను తీయలేవు. వాతావరణం సరిగాలేని సందర్భాలు అంటే మేఘావృతంగా ఉన్నప్పుడు, దట్టమైన పొగమంచు అలముకున్నప్పుడు తదితర సందర్భాల్లో స్పష్టమైన చిత్రాలను అందించలేవు. అందుకే ఇలాంటి ప్రతికూల సందర్భాల్లోనూ కీలక డేటా అందించేందుకు ఈఓఎస్ 09 వంటి శాటిలైట్లు అవసరమని రఘునందన్ తెలిపారు

దళిత విద్యార్థిపై దాడి హేయం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండిస్తున్నాని తెలిపారు. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ అన్నారు. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్షసాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదు దారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని మండి పడ్డారు. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి ఉందన్నారు. ఈ దాడికి కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి జేమ్స్‌పై దాడి..

కుల దురహంకార చర్యే : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్య అని, ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్ గ్యాంగ్ లపై కేసులు నమోదు చెయ్యాలని తిరుపతి సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రుయా ఆస్పత్రిలో చేరిన బాధిత విద్యార్థి జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రౌడీషీటర్ అండ్ గ్యాంగ్‌పై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చెయ్యడం సిగ్గు చేటని మండిపడ్డారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. జేమ్స్‌ను తక్కువ జాతివాడంటూ ప్రతి రోజు అవమానించడం, మూత్రం నోట్లో పోసి ఒకటిన్నర రోజు చిత్ర హింసలు పెట్టడం, అటవిక చర్యతో పాటు కులదురంకార చర్య అన్నారు. ఈ దుర్మార్గమైన చర్యను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జేమ్స్‌కు న్యాయం కోసం జరిగే పోరాటంలో సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలియజేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రఘు

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ .రఘు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

దాడి అమానుషం : సిపిఎం నగర కార్యదర్శి కే.వేణుగోపాల్

విద్యార్థిపై కులం పేరుతో దాడి చేసి, అనాగరికంగా ప్రవర్తించిన దుర్మాగులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్ ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలన్నారు.

తిరుపతిలో భారీ వర్షం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆదివారం తిరుపతి నగరంలో భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల నగరంలో పలు రోడ్లు పూర్తిగా జలమయ్యాయి. మధ్యాహ్నం నుంచి అడపా దడపా చినుకులు కురుస్తూ, సాయంత్రం ఒక్కసారి భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. బంగాళాఖాతంలో అల్పపీణ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఐదు రోజుపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. డిఆర్ మహల్ అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి, రాయల్ చెరువు రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, వెస్ట్ చర్చి రైల్వే అనంతపూర్ బ్రిడ్జితో పాటు లక్ష్మీపురం సర్కిల్లో వర్షపు నీరు రోడ్డుపై ఆగి ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. లక్ష్మీపురం సర్కిల్, శివ జ్యోతి నగర్, ఎర్ర మెట్ట, మధుర నగర్, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వర్షపు నీరు రోడ్డుపైనే ఆగిపోవడంతో ప్రజలు ఆస్తులు పడ్డారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో రోడ్డుపై వ్యాపారం చేసుకునేవారు అవస్థలు పడ్డారు. వేసవి తాపంతో అల్లాడుతున్న నగర ప్రజలు ఒక్కసారిగా వర్షం వల్ల వాతావరణ చల్లబడటంతో ఉపశమనం పొందారు.

పన్నుల వసూళ్లలో రెండో స్థానం

జిల్లాలో 29 కోట్ల 70 లక్షల రూపాయలు పన్ను వసూలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: పంచాయతీరాజ్ శాఖలో ఇంటి, ఆస్తి పన్నుల వసూలు చేయడంలో రాష్ట్రంలో తిరుపతి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో గుంటూరు జిల్లా ఉంది. ఏడాదిలో 29 కోట్ల 70 లక్షల 54 వేల 205 రూపాయలు తిరుపతి జిల్లాలో పన్ను వసూలు చేసినట్లు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో పన్ను వసూలు కార్యక్రమంలో 84.17 శాతంగా ఉంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పంచాయతీ రాజ్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. తిరుపతి జిల్లాలో 32 మండలాలు ఉన్నాయి. మొత్తంగా 822 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా వసూలు చేసిన రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీగా లిస్టులోకెక్కింది. ఈ పంచాయతీ నుంచి ఈ ఏడాది రెండు కోట్ల 20 లక్షలు పన్ను రూపంలో సంపాదించింది. అలాగే రెండో స్థానంలో తిరుచానూరు పంచాయతీ 20 లక్షలు, మూడో స్థానంలో ఎర్రవారిపల్లె మండలం ఎర్రవారిపాలెం గ్రామ పంచాయతీ 13 లక్షల రూపాయలు పన్ను రూపంలో ఆదాయం సాధించింది. జిల్లాలో ఇంటి పన్ను చెల్లించిన వారిలో 35 లక్షల 78, 56 మంది ఉన్నారు. నూటికి 99 శాతం పన్ను వసూలు చేయడంలో వాకాడు మండలం ముందుంది. ఆఖరి స్థానంలో చంద్రగిరి మండలం ఉంది. వాకాడు 98.99 శాతంగా ఉంటే, ఆఖరి స్థానంలో ఉన్న చంద్రగిరి మండలం 78.82 శాతంగా ఉంది. ఒక్క కరకంబాడి పంచాయతీకి అమర్ రాజా బ్యాటరీ నుంచి ఒక కోటి 46 లక్షల 14వేల రూపాయలు పన్ను రూపేణా చెల్లించారు. అదే పంచాయతీలో మంగల్ పరిశ్రమ 20 లక్షలు పంచాయతీకి పన్ను చెల్లించింది. వెంకటగిరి సమీపంలోని సిలికాన్ పరిశ్రమ 14 లక్షలు ఆ పంచాయతీకి పన్ను రూపంలో నగదు చెల్లించింది.

జిల్లాలో పంచాయతీల వారీగా..	
కోటి నుంచి 50 లక్షలు లక్షలు పన్ను వసూలు చేసిన పంచాయతీలు	15
10 లక్షల నుంచి 50 లక్షల వరకు పన్ను వసూలు చేసిన పంచాయతీలు	90
ఐదు నుంచి పది లక్షలు రూపాయల వరకు పొన్ను వసూలు చేసిన పంచాయతీలు	69
లక్ష నుంచి ఐదు లక్షల వరకు పన్ను తీసుకున్న గ్రామ పంచాయతీలు	411
లక్ష మాత్రమే వసూలు చేసిన పంచాయతీలు	237

దౌత్య పరంగా పాక్‌ను ఎండగట్టాలి

బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు సరికావు

అనేక పోరాటాల్లో ప్రతిరక్తపు బొట్టుకూ కమ్యూనిస్టు చరిత్ర మిగిలే ఉంది

: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : దౌత్య పరంగా పాక్‌ను ఎండగట్టే ప్రయత్నం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఆదివారం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో సిపిఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణలు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పై కేంద్రం అనేక ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి ఉందన్నారు. ఉన్న పళంగా అగ్రదేశం ప్రకటనతో సీజ్ ఫైర్‌కు కేంద్రం అమోదించడం వెనుక ఇంకా అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అయితే ఈ వ్యవహారంలో అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఉగ్రమూకలకు మతం, మానవత్వం, సిద్ధాంతం వంటివేమీ ఉండవని, వారిని పూర్తి స్థాయిలో అరికట్టే చర్యలు చేపట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఉగ్రమూకలకు, పాకిస్తాన్‌కు సంబంధం లేదని తేలితే వారితో కలిసి ఆ దేశంలోకి నేరుగా వెళ్లి ఉగ్రవాధులను పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రమూకల వ్యవహారంలో పాక్ అనుసరిస్తున్న తీరును ప్రపంచ దేశాలకు వివరించే క్రమంగా కేంద్రం ప్రకటించిన కమిటీల్లో బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పార్టీల ప్రమేయం లేకుండా సభ్యులను ఎంపిక చేయడాన్ని ఖండించారు. తొలినాళ్ల నుంచి దేశ కోసం చేస్తున్న పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేశారు. వేలాది మంది కమ్యూనిస్టులు దేశం కోసం అశువులు బాసారని వివరించారు. ఈ నేపథ్యంలో అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ వైఖరితో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. పాకిస్తాన్, పంజాబ్ విషయంలో కూడా గతంలో కమ్యూనిస్టులు చిత్తశుద్ధితో పనిచేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం నాటి నంచే ఇప్పటి వరకు కమ్యూనిస్టు పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. బీజేపీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనపోగా విచ్చినకర చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఇకనైనా దేశంలోని అన్ని పార్టీలకు కలుపుకొని విదేశీ సమస్యల పరంగా చర్చలు జరిపి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శ పి.మురళి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చిన్నం పెంచులయ్య, సీపీఐ నగర కార్యదర్శ జె. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇండియన్ క్రికెట్ టీమ్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు ⇄ కమీషన్ల ఆశ చావకనే మద్యం డ్రామా



మాట్లాడుతున్న వైసీపీ అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో సమయాపాలన లేకుండా 24 గంటలు మద్యం అమ్ముతూ తిరుపతి పవిత్రతను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని వైసిపి అధికార ప్రతినిధులు పసుపులేటి సురేష్, వాసు యాదవ్‌లు అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసలైన స్కాం కూటమి ప్రభుత్వం చేస్తోందని, మద్యం మాఫియాగా ఏర్పడి రాష్ట్రంలో మద్యం ఏరులై పారిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరకాలం పూర్తికావస్తున్న ఇప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ హామీలు చెయ్యకపోగా హామీల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి స్కాములంటూ ప్రచారం చేస్తున్నారని, మద్యం పేరుతో అసలైన కుంభకోణం చేస్తున్నది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. సమయపాలన లేని మద్యం అమ్మకాల ద్వారా మందు బాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారన్నారు. ప్రజలను మోసం చేసి కేవలం దోచుకో దాచుకో పంచుకో అన్న నినాదంతో పాలన కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లిందని, రాబోయే రోజుల్లో ప్రజలు ఈ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోటి, ప్రకాష్, కుప్పయ్య, రమణారెడ్డి, సాయి రాకేష్, మణి, రుద్రగోపి, యువరాజు, షణ్ముఖం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాయంలో తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన బార్లు, మద్యం షాపుల నుండి కమిషన్లు పొందిన అభినయ రెడ్డి ఆశ చావకనే మద్యం షాపులు తిరుగుతూ డ్రామాలు ఆడుతున్నారని, బార్ల నిర్వాహకుల నుండి ముడుపులు తీసుకున్న విషయంపై బహిరంగ చర్చకు రావాలని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్ల నిర్వాహకులు సమయం దాటిన తర్వాత నగదు లెక్కింపు, బార్ క్లీనింగ్ చేసుకుంటుంటే ఆ సమయంలో వెళ్లి ముందస్తుగానే చేసుకున్న ప్రణాళిక ప్రకారం తన మనుషులను అక్కడ ఉంచి డ్రామాలు ఆడించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పాలనపై బురద జల్లడానికి పూటకో డ్రామాలు ఆడుతున్నారన్నారు. టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి సురేంద్ర నాయుడు మాట్లాడుతూ అభినయ రెడ్డి మాస్టర్ ప్లాన్ రోడ్లలో దోచుకున్న భూములను, భూములు పోగొట్టుకున్న బాధితుల టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బు యాదవ్, శ్రీధర్, రూపేష్, నాగప్రతాప్, రవితేజ నాయుడు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం దారుణం

వైసిపి అధ్యక్షుడు సింహాల మోహన



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేస్తామని, చిన్నగొట్టిగల్లు మండలం వైసీపీ అధ్యక్షుడు సింహాల మోహన హెచ్చరించారు. ఆదివారం చిన్నగొట్టిగల్లులో స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే రెండు విడతలుగా ప్రజలపై రూ.15,485 కోట్ల భారం వేసిందన్నారు. అంతేకాక 2024–25 సంవత్సరానికి సంబంధించి సర్దుబాటు ఛార్జీ ప్రతిపాదన సిద్ధం చేసిందన్నారు. దీనివల్ల రానున్న కాలంలో దాదాపు రూ.1.10 లక్షల కోట్ల భారం ప్రజలపై పడనుందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనమునందు వాకాటి రామమోహన్ దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా సీనియర్ సభ్యులు వాకాటి రామ్మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామ మోహన్, పురుషోత్తమరావు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు గూడూరు



అర్జున అకాడమీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అనేక క్రీడల్లో గూడూరు విద్యార్థినీ విద్యార్థులు రాణించడం శుభ పరిణామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణ సమీపంలోని పోటు పాలెం వద్ద అర్జున అకాడమీని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జున అకాడమీ ద్వారా రాబోయే రోజుల్లో ఎంతోమంది క్రీడల్లో రాణించాలని వారికి మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివశంకర్, జయశంకర్, రూరల్ సిఐ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో మంగళవారం దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల, లక్ష్య ఫౌండేషన్ సంయుక్తంగా ప్రముఖ పరిశ్రమల ద్వారా 900 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలియజేశారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, భారత్ పెట్రోలియం డైరెక్టర్ లక్ష్మీ నారాయణ, గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు, జిల్లా నైపుణ్య అధికారి లోకనాదం, ప్లేస్మెంట్ అధికారి గణేష్, సునీల్, చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు బహూకరణ



ప్రజాశక్తి-కోట: కోట మండలం చిట్టేడు ఎన్బిటి కాలనీకి చెందిన హాసిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ప్రథమ స్థానం ఉత్తీర్ణత సాధించినందుకు చిట్టేడు గ్రామం మాజీ సర్పంచ్ ఈగ రఘురామయ్య, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు యాకసిరి చిన్నయ్యలు 5000 రూపాయలు నగదు బహుమతి ఆదివారం అందజేశారు. అంతేకాక బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు యాకసిరి చిన్నయ్య తనవంతు సాయంగా 50,000 రూపాయలు ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ బి టి కాలనీవాసులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్యాండిల్ స్మారక దినోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ దినోత్సవం జరిగింది. హెచ్ఐవి ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి నివాళి అర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి డాక్టర్ కాంత్, డాక్టర్ సురేష్, ఇతర సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ



ప్రజాశక్తి-రామచంద్రపురం: ఆదివారం రామచంద్రాపురం మండలంలో భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ కూటమి పార్టీల నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. రామచంద్రాపురం ఎంపీడీవో కార్యాలయం నుండి ప్రధాన కూడలి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ చౌదరి, కాయం హరినాథ్ రెడ్డి, నరసింహారెడ్డి, ఏ సిద్దయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు సంజీవ హరి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కావమ్మ మారయ్య తిరునాళ్ళు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని గోవింద పాలెంలో 3 రోజులుగా జరుగుతున్న శ్రీ కావమ్మ మారయ్య తిరునాళ్లలో భాగంగా మూడవరోజు ఆదివారం దేవతామూర్తులకు అభిషేకాదులు నిర్వహించారు. గ్రామ ప్రజలు పొంగళ్ళు పెట్టి మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. మధ్యాహ్నం శ్రీవిద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవింద పాలెం బెస్త సేవా సంఘం సభ్యులు ముని చంద్రయ్య, ప్రవీణ్ కుమార్, సాయికుమార్, రమేష్, దేవేంద్ర, పార్థసారథి పాల్గొన్నారు.

వ్యాపారులు సిండికేట్

పతనమవుతున్న మామిడి ధర



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:

అసలే కాపు లేదని మామిడి రైతులు ఆందోళన చెందుతుంటే గోరు చుట్టుపై రోకటి పోటులా మామిడి వ్యాపారులు సిండికేట్ కావడంతో ధరలు పతన మవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పుత్తూరు యార్డు పరిధిలో బేనిషా, తోతాపురి, సిందూరా, రుమాని, నీలం వంటి రకాలు విస్తారంగా క్రయవిక్రయాలు జరుగుతుండేవి. ఈ ఏడాది పూత ఆలస్యం కావడంతో కాపు అంతంత మాత్రమే వచ్చింది. అరకొరగా వచ్చిన కాపు అకాలవర్షం కారణంగా రాలిపోయింది. ఉన్న కాపు కోసి అమ్మకాలు సాగిస్తామనుకుంటే మామిడి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరల్లేకుండా చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా గిట్టుబాటు అయ్యేలా లేదని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర అందేలా అధికారులు చూడాలని వారు కోరుతున్నారు.



సిండికేట్ తో తగ్గిన మామిడి ధరలు

మామిడి రకం	గత నెలలో	ప్రస్తుతం
బేనిషా టన్ను	రూ.60-70 వేలు	రూ. 35 వేల లోపు
సిధూర టన్ను	రూ.40-50 వేలు	రూ. 20 వేల లోపు
రుమాని టన్ను	రూ.30-40 వేలు	రూ. 12 వేల లోపు
తోతాపురి టన్ను	రూ. 30-40 వేలు	రూ. 18 వేల లోపు

మామిడి కాయల వ్యాపారులు సిండికేట్ అవడంతో ధరలు పడిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి మామిడికి గిట్టుబాటు ధర అందించి ఆదుకోవాలి. ప్రభుత్వమే పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- వెంకటాద్రి, రైతు, దిగువ గుకూరు

మామిడి పంట కోసం అప్పుచేసి, మందులు పిచికారీ చేసి వాటికి కావలసిన ఖర్చులు చేశాం. ధర లేకపోవడంతో పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదు. అప్పులు ఎలా చెల్లించాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మోహన్ కృష్ణ, రైతు, ఎగువ గూకూరు

వినియోగదారులకు బంపర్ ఆఫర్



వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బిబి ఇటుకల పరిశ్రమ అధినేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్ బి బి (శ్రీ బాలాజీ బ్రిక్స్ ఇండస్ట్రీస్) సంస్థ అవతరించి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తమ వినియోగదారులకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. తమ వినియోగదారులకు ఇటుకల ఫ్యాక్టరీ వద్ద ఒక ఇటుక రాయి కొనుగోలు ధర ఎనిమిది రూపాయలని తెలిపారు. ఆదివారం ఎస్ బి బి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సింధూర పార్క్ హోటల్‌లో ఘనంగా వార్షికోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కె.వి చౌదరి మాట్లాడుతూ ఎస్‌బిబి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 12 రూపాయలు ఉన్న ఒక ఇటుక రాయును 8 రూపాయలకే ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అది తమ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద కొనుగోలు చేస్తే 8 రూపాయలకే లభిస్తుందని, ఒక్క రూపాయి రవాణా చార్జీ ఉంటుందని, మరొక రూపాయి టాక్స్ చెల్లించాల్సి ఉంటుందని, ఈ ఆఫర్ ఈనెల 31వ తేదీ రాత్రి 8 గంటల వరకే ఉంటుందన్నారు. ఇటుకురాళ్లు కావలసినవారు అడ్వాన్సు డబ్బులు చెల్లించి రశీదు పొందాలని కోరారు. ఈ బంపర్ ఆఫర్ ను తమ వినియోగదారులు సద్వినియం చేసుకోవాలన్నారు. 1985లో ఎస్‌బిబి పేరుతో ఇటుకుల తయారు ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఇటుకురాయిలు ఇవ్వడంతో తమకు మంచి పేరు రావడం జరిగిందన్నారు. దీంతోపాటు హోటల్ ఇండస్ట్రీ, బిల్డింగ్ నిర్మాణ ఇండస్ట్రీ, మెడికల్ ఇండస్ట్రీలో కూడా నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. తమ సంస్థలో కష్టపడి పనిచేసిన వారికి కూడా తగిన గుర్తింపు తాము ఇస్తున్నట్టు వెల్లడించారు. తాము 40 సంవత్సరాల వరకు విజయవంతంగా తమ వ్యాపారాలు కావడం కారణం తమ కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో ఉందన్నారు. వారి సహకారం వల్లే తాము ఈ స్థాయికి ఎదిగామన్నారు. తర్వాత ఎస్‌బిబిలో 30 సంవత్సరాలు 15 సంవత్సరాలు 10 సంవత్సరాల నుండి చేసిన సిబ్బందినితో పాటు మేస్త్రీలు, కూలీలను సత్కరించారు. అంతకుముందు జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన 26 మంది బాధితులకు మరియు సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిబి ప్రతినిధులు కే శ్రీనివాస చౌదరి, కే లోకేష్ బాబు, కే చైతన్య కృష్ణ పాల్గొన్నారు.


గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు

పట్టించుకోని సంబంధిత అధికారులు



ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : తిరుపతి జిల్లా, నాయుడుపేట మండలం, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఏ గ్రామంలో అయినా నీరు దొరకదేమో గాని మద్యం మాత్రం పుష్కలంగా దొరుకుతుంది. నాయుడుపేట సమీపంలోని, కోనేటి రాజుపాలెం రోడ్డు పక్కనే ఉన్న కూల్ డ్రింక్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ ధరల కంటే 30 నుండి 50 వరకు అధిక ధరలతో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఆగడాలు శృతిమించుతున్నాయి. గ్రామాల్లో ప్రశాంతత కరువై అనేక గొడవలు జరగడంతో పాటు, వందల సంఖ్యలో కుటుంబాలు వీధుల పాలవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. డాబాలలో మద్యం అమ్మకాలకు అనుమతి లేకున్నా, బార్లులో కన్నా ఎక్కువ మద్యం వ్యాపారం జరుగుతోంది. బెల్టు షాపులపై అనేక పర్యాయాలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా వారు ఏమాత్రం చలించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్ షాపుల నిర్మూలన చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ బెల్టు షాపులు నిర్వహణపై కఠిన చర్యలు చేపడతామని చెప్పినప్పటికీ, సంబంధిత శాఖలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. బెల్ట్ షాపుల నిర్వాహకులు ఏమాత్రం జంకు లేకుండా పబ్లిక్‌గా వారి పని వారు చేస్తూనే ఉన్నారు. వీరందరికీ స్థానిక నాయకుల అండదండలున్నాయని సమాచారం. ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. పై అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణను అడ్డుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వ్యవసాయ పనులకు భూ పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వందవాసి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వామపక్షాల కృషితో నాడు అమలు చేస్తే, నేడు అధికారంలోకి వచ్చిన బిజెపి క్రమంగా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తక్షణమే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద రైతుల నుండి ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల అవసరాల కొరకు భూసేకరణ చేస్తున్న ప్రభుత్వం, భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయడంలో కాలయాపన చేస్తుందంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు రాజగోపాల్, రమణయ్య కార్యదర్శులు శంకరయ్య, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బమ్మ,, ముని శంకర్, రామచంద్రారెడ్డి, అముదా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పుత్తూరు పట్టణం హిమజ హైస్కూల్‌లో ఆదివారం ఎన్టీఆర్ అభిమానులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, పిండి కృష్ణ, అభిఐతం, నగరి మణి, కౌశిక్, ఉదయ్, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మినీ మహానాడు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలోని పేద ప్రజలకు సంక్షేమం అందించాలన్నా, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఆర్ రెడ్డి కళ్యాణమండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీజెండాను ఆవిష్కరించి స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబునాయుడు ముందుకు తీసుకువెళుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సహాన్ని నింపుతున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూరి చేసి తెలుగుప్రజలకు అందించేందుకు ఆయన శ్రమిస్తున్నారన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, శీలం కిరణ్ కుమార్‌లు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమం తెలుగు ప్రజలకు పండుగ లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో తానంకి నానాజీ, నెలబల్లి భాస్కరెడ్డి, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడపలో జరుగనున్న మహానాడును జయప్రదం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ఈ నెల 27, 28 తేదీల్లో కడపలో నిర్వహించనున్న టిడిపి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో ఆదివారం మినీ మహానాడు కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలనుద్దేశించి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇంతకు మరింత ఉత్సాహంతో మహానాడు కార్యక్రమానికి తరలి రావాలని సూచించారు. జగన్ గడ్డపై నిర్వహిస్తున్న మహానాడులో టిడిపి కార్యకర్తల సత్తా ఏంటో చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నైనారు పొన్నారావు, విజయ్ కుమార్ నాయుడు, దశరథా చారి, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వియు విసిగా బీసీ ప్రొఫెసర్లనే నియమించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా అర్హులైన బీసీ ప్రొఫెసర్లను నియమించాలని బిసి నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ కమిటీ నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కేతే నారాయణస్వామి గౌడ్ మాట్లాడుతూ ఎస్వియుకు ఇప్పటివరకు రెగ్యులర్ విసి పదవిని బీసీ ప్రొఫెసర్లకు ఇవ్వలేదన్నారు. త్వరలో నియమించబోయే రెగ్యులర్ వైస్ ఛాన్సర్ పదవిని ఎస్వీయూలో అర్హులైన బిసి ప్రొఫెసర్లకు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిరుపతి కేంద్రంగా కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య యాదవ్, గాండ్ల సంఘం నాయకులు సాకం ప్రభాకర్, వడ్డెర సంఘం రాయలసీమ అధ్యక్షులు విడగొట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలంలో చర్చి నిర్మాణంపై అభ్యంతరం



ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలం, శానంబట్లలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇంటిలో చర్చి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ విషయమై విశ్వహింద పరిషత్, బజరంగ్ దళ్, బిజెపి, జనసేన, హిందూ సంఘాల నేతలు ఆదివారం ఆందోళన చేపట్టారు. రెండు రోజుల క్రితం స్థానికులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ కాలనీ వాసులు, హిందూ సంఘాలకు పిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి వెళ్ళాలి అనుకొన్న హిందూ సంఘాలను, కాలనీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. చర్చ్‌గా మార్చిన ఇంటిని సీజ్ చేసామని ఎమ్మార్వో సెలవులో ఉన్నందున రెండు రోజుల్లో పరిష్కారం చూపుతామని పోలీసు అధికారులు చెప్పడంతో అందరూ శాంతించారు.

ముక్కంటి సేవలో కేంద్రమంత్రి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర కన్స్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖా మంత్రి ప్రహల్లాద జోషి ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

కన్నుల పండుగగా శ్రీ కల్యాణ వెంకన్న స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) మండలంలోని శ్రీనివాసమంగాపురంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి స్వర్ణరథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో పి.వరలక్ష్మి, ఈఈ జగన్మోహన్ రెడ్డి, డిప్యూటీ ఈవో దామోదరం, ఏఈవో ఎం. గోపినాథ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీకి విశేష స్పందన

ప్రజాశక్తి - సత్యవేడు: భారత దేశ సైనికుల వీరోచిత పోరాట ఫలితమే ఆపరేషన్ సింధూర్ విజయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీకి విశేష స్పందన లభించింది. సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ నుండి టవర్ క్లాక్ వరకు ర్యాలీ సాగింది.

క్రైం న్యూస్

పొలం గట్టుపై నడిచినందుకు వ్యక్తిపై దాడి



గాయపడ్డ పిట్టల నాగరాజు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పొలం గట్టుపై నడిచినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామానికి చెందిన పిట్టల నాగరాజు(30) పంటకు నీరు పారగట్టేందుకు శనివారం తన పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తన పొలం గట్లపై నడవద్దంటూ విజయ్ బాబు అనే వ్యక్తి నాగరాజును హెచ్చరించాడు. ఈ క్రమంలో మోటారు వేసి తిరిగి పొలం గట్లపై నడిచి వస్తుండగా విజయ్ బాబు తనపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు తెలిపారు.

రికార్డులు సరిగా లేని వాహనాలు సీజ్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రికార్డులు సరిగా లేని 11 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను తొట్టంబేడు పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా సీఐ తిమ్మయ్య నేతృత్వంలోని పోలీసుల బృందం తొట్టంబేడు గ్రామాన్ని జల్లెడ పట్టారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. అసాంఘీక కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులు సరిగా లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్ కు తరలించారు.

వేసవి యాత్రకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈ నెల 22వ తేదీ నుండి జూలై 13వ తేదీ వరకు మూడు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు ఐఆర్సిటిసి టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్ జీపి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం–ఈ యాత్రలో అరుణాచలం, రామేశ్వరం, మధురై , కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర మే 22వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14700, 3 ఏసీ ధర రూ.22900, 2 ఏసీ ధర రూ.29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుంది. గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర–ఈ యాత్రలో వారణాసి, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగరాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.16200, 3 ఏసీ ధర రూ.26500, 2 ఏసీ ధర రూ.35000 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం,పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగావెళ్తుంది. ఐదు జ్యోతిర్లింగ యాత్ర – ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 5 వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14700, 3 ఏసీ ధర రూ.22900, 2 ఏసీ ధర రూ.29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముధడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది. ఈ యాత్రలకు రైలు, బస్సు, హోటల్, ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితమని రైల్వే అధికారులు తెలిపారు. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారన్నారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారని తెలిపారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030712, 9281030749, 9281030750, 9281030740లకు సంప్రదించాలని.

యస్వీయూ వసతి గృహాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వార్డెన్లు, ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో విద్యార్థుల హాస్టల్ గదులను, బ్లాక్‌లను ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, వార్డెన్లు, ప్రిన్సిపాల్ కలసి ఆదివారం తనిఖీ చేశారు. కొన్ని నెలలుగా అనధికారికంగా, విశ్వవిద్యాలయానికి ఎలాంటి డబ్బులు చెల్లించకుండా నివసిస్తున్న విద్యార్థులున్న గదులను తాళం వేశారు. కొన్ని సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో ఐ బ్లాక్ , ఎఫ్ బ్లాక్ లలో నివాసం వుంటున్న బైట వ్యక్తులను,రాజకీయ పార్టీలకు అనుబంధం వున్నవారిని కట్టడి చేయాలనే ఉద్దేశ్యంతో ఆ రెండు బ్లాక్‌లను మూసి వేయమని వార్డెన్లను అధికారులు ఆదేశించారు. డబ్బులు చెల్లించిన, విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులతో కొన్ని రోజుల తర్వాత ఈ బ్లాక్‌లు ప్రారంభిస్తామని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుప్రభాత సేవ ముగిసిన తర్వాత వీఐపీ బ్రేక్ దర్శనాల ద్వారా ఇండియన్ క్రికెట్ టీమ్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దర్శించుకున్నారు.

ఆదిశంకరలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఆదిశంకర ఇంజినీరింగ్ టెక్నాలజీ కాలేజీలో ఆదివారం ద్వజస్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు, శాస్త్ర సాంకేతిక శాఖ, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల స్థాయి కమిటీ సభ్యులు సుజీత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో శాస్త్ర సాంకేతికతను నేర్చుకునే విద్యార్థులు భవిష్యత్తు నాయకులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డా.వంకి పెంచలయ్య , ఈసిఈ శాఖ ప్రొఫెసర్ డా. కె.ధనుంజయ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జే.రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లాపూరి అమ్మవారి సేవలో మాజీ మంత్రి రోజా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలంలో జరిగిన శ్రీ కొల్లాపూరి అమ్మవారి తిరునాళ్ మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్ కె రోజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నింద్ర మండలం వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.